# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 22-06-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ చట్టసభల్లో సభ్యులు క్రమశిక్షణతో మెలిగి ప్రజాస్వామ్యాన్ని కాపాడుతూ, సభను హుందాగా నడిపించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ 16వ శాసనసభాపతిగా చింతకాయల అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి మండలి సమావేశం ఈనెల 24న జరగనుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ తెలియజేశారు.
- ❖ రాష్ట్రంలో కొత్తగా 40 వేల 336 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తూ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దస్త్రంపై తొలి సంతకం చేశారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" కార్యక్రమం 111వ సంచిక ఈ నెల 30న ప్రసారం కానుంది.

======================

శాసనసభ సాంప్రదాయాలను పాటిస్తూ రాష్ట్రాభివృద్ధికి సభ్యులందరూ కృషి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. శాసనసభ రెండవ రోజు సమావేశాల్లో ముఖ్యమంత్రి ఈరోజు మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమకు ఘన విజయం అందించడంతో పాటు పెద్ద బాధ్యత అప్పగించారని అన్నారు. చట్టసభలకు రావడం అరుదైన అవకాశమని, తమను ఎన్నుకున్న ప్రజలకు ఏం చేయాలో గుర్తుపెట్టుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చట్టసభల్లో సభ్యుల ప్రవర్తన సరిగా ఉండాలని, మాట్లాడే ప్రతి విషయాన్నీ రాష్ట్రమంతా చూస్తుందని అన్నారు. రాజ్యాంగస్ఫూర్తితో, ప్రజాస్వామ్యాన్ని కాపాడుతూ, సభ హుందాగా నడుస్తుందని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

======================

ఈనెల 24వ తేదీ ఉదయం 10 గంటలకు రాష్ట్ర సచివాలయం మొదటి బ్లాకులోని మంత్రి మండలి సమావేశ హాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి మండలి సమావేశం జరగనుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ తెలియజేశారు. రాష్ట్ర మంత్రి మండలి సమావేశానికి సంబంధించిన అజెండా అంశాల సమాచారాన్ని సమర్పించాలని అన్ని శాఖల కార్యదర్శులకు సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్- మనసులో మాట" కార్యక్రమం 111వ సంచిక ఈ నెల 30వ తేదీన ఆకాశవాణి ద్వారా ప్రసారమవుతుంది. ప్రధానమంత్రిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత జరగనున్న తొలి "మన్ కీ బాత్" కార్యక్రమం ఇది. ప్రజలు తమ సలహాలు, సూచనలను ఈ నెల 28వ తేదీ లోగా టోల్ ఫ్రీ నెంబర్ 1800-11-7800కు ఫోన్ చేసి గాని, నరేంద్ర మోదీ యాప్ ద్వారా లేదా, ఇతర వేదికల ద్వారా తెలియజేయవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్తగా 40 వేల 336 వ్యవసాయ విద్యుత్ కనక్షన్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ఇంధన శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ దస్త్రంపై తొలి సంతకం చేశారు. ఈ రోజు రాష్ట్ర సచివాలయంలో ఆయన రాష్ట్ర ఇంధనశాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన రీతిలో విద్యుత్ ను అందించేందుకు విద్యుత్ సరఫరా, డిమాండ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తామని అన్నారు. దేశంలోనే ఉత్తమ విద్యుత్ శాఖగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ శాఖను తీర్చిదిద్దేందుకు అన్ని విధాలా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు దశలవారీగా సోలార్ విద్యుత్ కనెక్షన్ల మంజూరు, అదే విధంగా ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో ఇంటింటికి మూడు కిలోవాట్ల సోలార్ విద్యుత్ అందించే కార్యక్రమానికి సంబంధించిన దస్త్రాలపై కూడా మంత్రి సంతకాలు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

వస్తు, సేవల పన్ను (GST)కు సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకునే జీఎస్టీ కౌన్సిల్ సమావేశం ఈరోజు ప్రారంభమైంది. కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి జీఎస్టీ కౌన్సిల్ సమావేశమైంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆర్థిక మంత్రులు సహా పలు రాష్ట్రాలకు చెందిన మంత్రులు, అధికారులు హాజరయ్యారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ 16వ శాసనసభాపతిగా అనకాపల్లి జిల్లా, నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం శాసనసభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఎన్నికను ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరి సభలో అధికారికంగా ప్రకటించారు. అనంతరం నూతన సభాపతిగా అయ్యన్న పాత్రుడు బాధ్యతలు స్వీకరించారు. ఆయనను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సహా పలువురు శాసనభ్యులు సభాపతి స్థానానికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా సభాపతి మాట్లాడుతూ, స్పీకర్ పదవి అనేది ఒక భాధ్యతయుతమైనదని అని అన్నారు. సభా మర్యాదలను కాపాడుతూ, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేదిశగా పనిచేస్తానని పేర్కొంటూ....

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

సరిహద్దు ప్రాంతాలలో రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా భారత్ - బంగ్లాదేశ్ లు కలిసి ముందుకు వెళుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం భారత్ కు వచ్చిన బంగ్లాదేశ్ ప్రధాని

షేక్ హసీనాతో ఈరోజు ప్రధానమంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరుదేశాల మధ్య వాణిజ్య, సహకార సంబంధాల బలోపేతానికి కృషి చేస్తామని మోదీ తెలిపారు. డిజిటల్, ఎనర్జీ కనెక్టివిటీపై దృష్టి పెడతామనీ, తద్వారా ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలు పటిష్టమవుతాయని ప్రధాని పేర్కొన్నారు. మొత్తం 54 నదులు భారత్, బంగ్లాదేశ్ మీదుగా ప్రవహిస్తున్నట్లు గుర్తు చేసిన ప్రధాని.. వరదల నిర్వహణ, ముందస్తు హెచ్చరికలు, తాగునీటి ప్రాజెక్టుల విషయంలో పరస్పరం సహకరించుకున్నట్లు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

నీట్ యూజీ (NEET UG), యూజీసీ నెట్ (UGC NET) పరీక్షల్లో జరిగిన అవకతవకలపై నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలో పరీక్షల నిర్వహణ ప్రక్రియలో సంస్కరణల కోసం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏడుగురు సభ్యులుండే ఈ కమిటీకి ఇస్రో మాజీ చీఫ్ కె.రాధాకృష్ణన్ నేతృత్వం వహించనున్నట్లు తెలిపింది. పరీక్షల నిర్వహణ విధానంలో సంస్కరణలు, డేటా సెక్యూరిటీ ప్రోటోకాల్స్‌లో పురోగతి, జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ పని తీరుపై ఈ కమిటీ రెండు నెలల్లోగా తన నివేదికను సమర్పిస్తుందని కేంద్రం తెలిపింది. ఈ కమిటీలో ఎయిమ్స్ దిల్లీ మాజీ డైరెక్టర్ డా.రణ్‌దీప్ గులేరియా, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.జె.రావు, ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ కె.రామమూర్తి, కర్మయోగి భారత్ సహ వ్యవస్థాపకుడు పంకజ్ బన్సల్, ఐఐటీ దిల్లీ డీన్ ప్రొఫెసర్ ఆదిత్య మిత్తల్, కేంద్ర విద్యాశాఖ జాయింట్ సెక్రటరీ గోవింద్ జైశ్వాల్ సభ్యులుగా ఉన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

గత ప్రభుత్వం రైల్వే ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించిందని, దాంతో రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులన్నీ నిలిచిపోయాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఈరోజు గుంటూరులో రైల్వే ప్రాజెక్టులపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పురుషుల టీ-20 క్రికెట్ ప్రపంచకప్ సూపర్-8లో భాగంగా ఈరోజు రాత్రి 8 గంటలకు భారత్ - బంగ్లాదేశ్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. విండీస్‌లోని ఆటింగ్వా వేదికగా ఇరు జట్లు తలపడతాయి. ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తే భారత్ సెమీస్‌కు చేరుకోనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =